# "ఆయన నామమందలి"

# (3:12-26)

మనం జన్మించినప్పుడు, మన తల్లిదండ్రులు మనకు పేర్లు పెడతారు. మనం పెద్దయిన తరువాత ఆ పేర్లకు భావం, ప్రాముఖ్యత కలుగుతుంది. మన పేర్లు మనలను గుర్తింపజేయడం మాత్రమే గాక, మనం ఏమైయుంటామో దానిపట్ల అవి నిలుస్తాయి. నీవు బాగా ఎరిగిన ఒకని పేరునుగూర్చి ఆలోచించు. ఆ అక్షరాల పొందికనుగూర్చి ఆలోచిస్తున్నావా? కాదు. నీ మనస్సులో ఆ వ్యక్తి ప్రదర్శించిన కొన్ని గుణాలనుగూర్చి ఆలోచిస్తున్నావు. నీవు ఆ వ్యక్తినే చూస్తున్నావు.[1]

బైబిల్లో, పేర్లు గుర్తింపు నివ్వడం మాత్రమేకాదు. అవి ఆ వ్యక్తియొక్క స్వభావ లక్షణాలకు ప్రాతినిధ్యమిస్తాయి. నిర్గమ 20లో మూడవ ఆజ్ఞ ఏమంటే - ''నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరించువానిని నిర్దోషిగా ఎంచడు'' (7 వ.). ఆయన నామాన్ని వ్యర్థంగా ఉపయోగించేవారిని దేవుడు ఎందుకు శపిస్తానన్నారు? ఆయన నామాన్ని అగౌరవంగా చూచినప్పుడు, ఆయన్ను అగౌరపరుస్తావు!

అపొ. 3-4ల ముఖ్యత్వం యేసుక్రీస్తు నామానికి యివ్వబడింది (3:6, 16; 4:7, 10, 12, 17-18, 30). ప్రభువైన యేసుయొక్క మరణం, సమాధి, పునరుత్థానం, ఆరోహణముల తరువాత ...

> పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్న వారిలోగాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ. 2:9-11).

మూడు, నాల్గు అధ్యాయాల్లో ఆయన నామమున స్వస్థపరచబడటం; ఆయన నామమున ప్రకటించడం, ఆయన నామమున శ్రమపడటం, ఆయన నామమున శక్తి పొందడం - అనే వాటినిగూర్చి చదువుతాం. ఈ రెండు అధ్యాయలను మనం చదివేటప్పుడు, యేసు నామమనేది ఆయన్ను గుర్తింపజేయడం మాత్రమేగాక, ఆ నామంలో ఆయన శక్తి, ఆయన ఉద్దేశాలు, ఆయన వ్యక్తిత్వం సహా చుట్టబడి ఉన్నాయి! ఈ రెండు అధ్యాయాల్లో ప్రాముఖ్యమైన వ్యక్తి- పేతురో, యోహానో, స్వస్థపరచ

బడినవాడో, లేక సభలోని ఏ సభ్యుడోకాదు. వాటిలో కీలకమైన వ్యక్తి యేసుక్రీస్తే! యూదా మతనాయకులు యేసును వదిలించుకొన్నామనుకుంటున్నారు గాని; వారికి ఆయన విషయమై తిరిగి ఆలోచింపవలసి వచ్చింది.

కార్యగ్రంథం చివరి భాగంలో, దాఖలు చేయబడిన పేతురుయొక్క మరో ప్రసంగం ఉంది. అది తాను ముగించని ప్రసంగం (4:1ని చూడు). దాన్ని బోధించిన తీరు అపొ. 2లాగే ఉంటుందిగాని, దాన్ని బలపరచే పాయింట్లు[2] వేరుగా ఉన్నాయి. అపొ. 2లో, పేతురు తన ప్రసంగంకొరకు పాత నిబంధన మూలంమీద ఆధార పడ్డాడు; ముఖ్యంగా దావీదును కోట్‌చేశాడు. ఈ ప్రసంగంయొక్క ప్రత్యేకత: యేసు యొక్క వివిధములైన హోదాలను చూపడమే అపొ. 2లో, పేతురు యేసును దావీదు కుమారుడని; క్రీస్తని ప్రకటించాడు; ఈ ప్రసంగంలోనైతే, యేసును దేవుని సేవకుడని, పరిశుద్ధుడని, నీతిమంతుడని, జీవాధిపతియని, మోషేవంటి ప్రవక్తయని పేతురు వివరించాడు.

## గుర్తింపును నిరాకరించారు (3:12)

ఈ సమయంలో, జనులు పేతురు, యోహాను, భిక్షగాడుల చుట్టు పోగయ్యారు. కడకు, ప్రతిఒక్కడు సిద్ధంగా ఉన్నాడు, జనాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ''పేతురు దీనిని చూచి ప్రజలతో ఇట్లనెను - ఇశ్రాయేలీయులారా, మీరు వీని విషయమై యెందుకు ఆశ్చర్యపడుచున్నారు?'' (12a వ.). గతంలో యెరూషలేమునందు యేసు తరచుగా రోగులను బాగుచేయడం వారు చూచేయుంటారు. స్వస్థత పొందినవానిని చూపి, పేతురు యిలా కొనసాగించాడు. ''మా సొంతశక్తి చేతనైనను భక్తి[3] చేతనైనను నడువను వీనికి బలమిచ్చినట్టుగా మీరెందుకు మాతట్టు తేరిచూచుచున్నారు?'' (12b వ.).

మెప్పుపొందడానికి వారు శోధింపబడలేదంటే, పేతురు యోహానులు నరమాత్రుల కంటె తక్కువవారైయుండాలి. ''మనలో ఎవడు గొప్పవాడు?'' అని దెబ్బలాడుకునే గుంపులో వారు భాగస్తులైయుండి ఎక్కువ కాలం కాలేదు (మార్కు 9:34). ఇది వారికి తరుణం! అయితే తన సొంత శక్తిగాని భక్తిగాని స్వస్థతకు కారణంకాదని పేతురు వారికి తెలపడం ఎంతో ఉత్సాహకరంగా ఉంది. స్వస్థత చేస్తామని చెప్పుకొంటూ (చేయలేకపోయినా) పొగడ్తలు కోరేవారికిని, అపొస్తలులకును ఎంత వ్యత్యాసంగా ఉందో!

## జరిగినదానిని వర్ణించడం (3:13-15)

స్వస్థతకు ఘనత యేసుకే చెల్లాలని పేతురు చెప్పబోతున్నాడు. దానికి ముందు యూదులు ఆయనపట్ల అనుసరించిన వైఖరిని - తారతమ్యాలను ఉపయోగించి

అతడు వివరించుతున్నాడు. మొదటి తారతమ్యం 13వ వచనంలో ఉంది; చూడు.

> అబ్రాహాము ఇస్సాకు యాకోబు అనువారి దేవుడు (నిర్గమ. 3:6, 15లో దేవుడు మోషేకు తన్నుతాను బయలుపరచుకొన్న విధానమది), అనగా మన పితరుల దేవుడు తన సేవకుడైన[4] యేసును మహిమపరచియున్నాడు; మీరాయనను అప్పగించితిరి, పిలాతు ఆయనను విడుదల చేయుటకు నిశ్చయించినప్పుడు మీరు అతనియెదుట ఆయనను నిరాకరించితిరి.

యేసుయొక్క పదవులలో పేతురు చూపించిన మొదటిది - ''దేవుని సేవకుడు'' ఈ పదం 26వ వచనంలోకూడా తిరిగి ప్రయోగింపబడింది. యెషయా గ్రంథం యొక్క గొప్ప చర్చనీయాంశాల్లో ఒకటి ''బాధింపబడిన సేవకుడు''[5] ఈ భావనే కీర్తనల్లోను,[6] యింకా యితర స్థలాల్లోను ప్రతిధ్వనించింది. ప్రవక్తలు పలికిన సేవకుడు యేసేనని పేతురు తన శ్రోతలు తెలిసికోవాలని కోరాడు.

తన సేవకుని దేవుడు ఏమిచేశారు? దేవుడు ఆయనను మహిమపరచారు. అయితే దానికి ప్రతికూలంగా యూదులు ఆయనకు ఏమిచేశారు? వారి నాయకులు ఆయనను పిలాతుకు అప్పగించారు.[7] ఆమీదట జన సమూహాలు ఆయన్ను నిరాకరించారు. ''క్రీస్తు అనబడిన యేసును ఏమి చేతుమని'' పిలాతు వారినడిగినప్పుడు, ''సిలువవేయమని అందురును చెప్పిరి'' పిలాతు - ''ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెనని అడుగగా, వారు- సిలువవేయుమని మరి ఎక్కువగా కేకలు వేసిరి'' (మత్తయి 27:22-23).

13వ వచనంలో రెండవ తారతమ్యం చూపబడింది. ఒకవైపు, పిలాతు, అపవిత్రుడైన రోమా అధిపతియే, యేసును విడుదల చేయగోరాడు. మరోవైపు, వారు దేవుని ప్రజలైయుండి కూడా ఆయన మరణాన్నే కోరారు. విషాధకరమైన ఆ సమయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని, వారిలో కొందరైనా తమ తలలు దించుకొనియుంటారు.

పేతురు చూపే మూడవ తారతమ్యం; యేసుకు తాను సూచించిన రెండవ బిరుదు; అది 14వ వచనంలో ఉంది. ''మీరు పరిశుద్ధుడును నీతిమంతుడునైన వానిని నిరాకరించి, నరహంతకుడైన మనుష్యుని మీకు అనుగ్రహింపుమని అడిగితిరి.'' ''పరిశుద్ధుడు''[8] ''నీతి మంతుడు''[9] అనేవి పాత నిబంధన భాషలో - రెండు రూపాల బిరుదు. యేసు దేవుని పరిశుద్ధుడని దయ్యాలు ఒప్పుకొన్నప్పుడు, ఆయన దేవత్వాన్ని అవి గుర్తించాయి (మార్కు 1:24).[10] ఇక్కడ తారతమ్యం - పరిశుద్ధుడును నీతిమంతుడునగు యేసుకును, నరహంతకుడైన బరబ్బాకు మధ్య చూపబడింది. పరిశుద్ధుడును నీతిమంతుడగువానికి జనసమూహం ఏమి చేసింది? వారు ఆయనను నిరాకరించి, సిలువ వేయుమని కోరారు. అల్లరి రేపినవాడు, నరహంతకుడైన బరబ్బాకు ఏమికోరారు? అతన్ని విడుదల చేయుమని కోరారు (లూకా 23:13-25).

నాల్గవ తారతమ్యం 14వ వచనం చివరిలోను, 15వ వచనం ఆరంభంలోను వుంది. ''నరహంతకుడైన మనుష్యుని మీకు అనుగ్రహింపుమని అడిగితిరి. మీరు జీవాధిపతిని చంపితిరి.'' అధిపతి అనేది (*archegos*) అనే గ్రీకు పదంనుండి తర్జుమా చేయ బడింది. దానికి అక్షరార్థం - ''ముందున్నవాడు'' - అని. క్రొత్త నిబంధనలో ఈ పదం నాల్గుసార్లు ప్రయోగింపబడింది. సామాన్యంగా, ''ఆరంభించువాడు''; లేదా ''ముందుగా వెళ్లువాడు'' అని అర్థం. **NIV** ఈ పదాన్ని ''జీవమునకు కర్త'' అని తర్జుమాచేసింది. **NCV** ''జీవమును యిచ్చువాడు''అని అంది. ఇక్కడ తారతమ్యం ఏమంటే - బరబ్బా - ప్రాణాన్ని తీసేవాడు; యేసు ప్రాణానికి మూలమైనవాడు. ఇంతకు పేతురు వారితో ఏమన్నాడంటే - ప్రాణాన్ని నశింపజేసినవాడినేమో బ్రతుకనిచ్చారు; ప్రాణాన్ని ప్రసాదించే ఆయననేమో నశింపజేయబూనారు!

## పునరుత్థానం ప్రచురించబడింది (3:15)

జీవానికి ఆధారభూతుడు లేక మూలమైనవాన్ని చంప ప్రయత్నించడం కంటే, నిష్ప్రయోజనమైన కార్యం మరొకటి లేదనే చెప్పాలి! పేతురు చూపిన చివరి తారతమ్యంలో, వారి కార్యంయొక్క నిష్ప్రయోజనపు స్థితి గుర్తింపబడింది (15 వ.). ''మీరు జీవాధిపతిని చంపితిరిగాని దేవుడు ఆయనను మృతులలోనుండి లేపెను.'' యూదులు యేసును చంపారు; దేవుడు ఆయనను లేపారు. ''కల్వరి నరుని కడాపటి పలుకైయుండవచ్చుగాని; ఖాళీ సమాధి (దానికి) దేవుని కడపటి వార్తయైయుంది''[11]

తన శ్రోతలయొక్క దోషాన్నిగూర్చి పేతురు నొక్కిచెప్పాడు! నరులు తమ పాపములనుండి మరలక మునుపు, వారు తమ పాపముల విషయమై ఒప్పించబడాలి. రక్షణనుగూర్చిన సువార్త ప్రకటింపబడకమునుపు, పాపమునుగూర్చిన దుర్వార్త వినిపింపబడాలి. స్వస్థతను కోరకముందు, జనులు ఎంత రోగిష్ఠులైయున్నారో తెలుపబడాలి!

15వ వచనంలో, క్రీస్తు పునరుత్థానాన్నిగూర్చి ప్రస్తావించి, ''అందుకు మేము సాక్షులము'' అని పేతురు అన్నప్పుడు, అతడు తనను, యోహానును వారికి చూపించు కొని యుండవచ్చు. (ఆ కుంటివానిని) స్వస్థపరచిన ఏజెంట్లు వారైయుండగా, పునరుత్థానానికి అది బలమైన రుజువుగా ఉంది.

## విమోచకుడు హెచ్చింపబడ్డాడు (3:16)

పేతురు చెప్పిందంతాకూడ, యేసు నామాన్ని హెచ్చించడానికి దారితీస్తుంది: ''ఆయన నామమందలి విశ్వాసము మూలముగా ఆయన నామమే మీరు చూచి ఎరిగియున్న వీనిని బలపరచెను; ఆయనవలన కలిగిన విశ్వాసమే మీ అందరియెదుట

వీనికి ఈ పూర్ణస్వస్థత కలుగజేసెను'' (16 వ.). ఆదిభాషలోను, తర్జుమాలోను ఈ ప్రతిపాదన వికృతంగా ఉన్నట్టు కన్పిస్తుంది. అది అలా ఎందుకంటే - పేతురు పలికిన మాటలే అచ్చమైన కొటేషన్‌గా దింపబడినట్టుంది. ఇప్పటివరకు దైవప్రేరేపిత ప్రచురణ కర్తగా పనిచేసి, 16వచనం వచ్చేసరికి, పేతురు పలికిన అతని సొంతమాటలనే లూకా కోట్‌చేసినట్టుంది. (అంటే కార్యగ్రంథంలో లూకా ప్రసంగాలను కనిపెట్టినట్టుగాని, అపొస్తలుల నోట, తన మాటలు పెట్టినట్టులేదు). అది వికృతంగా ఉన్నా, మరింకెలాగున్నా, పేతురుయొక్క సందేశం మాత్రం బహుతేటగా ఉంది. పేతురు యోహానుల యోగ్యతవలన అతడు స్వస్థ పరచబడబ లేదుగాని, యేసు నామమునందే వాడు పూర్ణస్వస్థత పొందినవాడై నిలిచియున్నాడు!

యేసునందు, ఆయన నామమందు విశ్వాసాన్నిగూర్చి యిక్కడ నొక్కిచెప్ప బడుతుంది గమనించు. ''ఆయన నామమందలి విశ్వాసమువలన'' స్వస్థతకలిగింది. అంటే ఆ విశ్వాసం ఆయనద్వారా కలిగిందే. ఆ విశ్వాసమే అతనికి పూర్ణస్వస్థత నిచ్చింది. చర్చింపబడిన ఈ విశ్వాసం - స్వస్థపరచిన పేతురు యోహానుల విశ్వాసమే. అది స్వస్థత పొందినవాని విశ్వాసంకాదు (బాగుపడతాడనే నిరీక్షణే వానికి లేదుగదా)! గతంలో వారు దయ్యాన్ని వెళ్లగొట్టలేకపోయినప్పుడు, వారి అల్ప విశ్వాసంవల్లనే చేయలేకపోయారని ప్రభువు తెలిపారు (మత్తయి 17:20). యేసు పునరుత్థానులైన తరువాత, ఆ పదునొకరికి ప్రత్యక్షమై, ''వారి అపనమ్మిక నిమిత్తం'' వారిని గద్దించారు (మార్కు 16:14). ఆమీదట సర్వలోకంలో సువార్త ప్రకటించే పనిని వారికి అప్పగించిన తరువాత, ఆయన వారితో యిలా అన్నారు:

> నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును, ఏవనగా, నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు; క్రొత్తభాషలు మాటలాడుదురు, పాములను ఎత్తి పట్టుకొందురు, మరణకరమైనదేది త్రాగినను అదివారికి హాని చేయదు, రోగులమీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురని వారితో చెప్పెను. (మార్కు 16:17-18).

అపొస్తలులు నమ్మినట్టయితే, ''ఆయన నామంలో'' రోగులను బాగుచేస్తారని ప్రభువు వారితో చెప్పారు. అపొ. 3లో జరిగింది ఖచ్చితంగా దాని నెరవేర్పే!

పేతురు సందేశాన్ని తిరిగి ఆలోచన చేద్దాం. కుంటివాడు అద్భుతరీతిగా స్వస్థపడిన సంగతిని ఎవడూ కాదనలేడు గనుకను, మరియు అతడు యేసు నామముననే స్వస్థత పొందియున్నాడు గనుకను, యేసు తప్పక మెస్సీయా అయ్యుండి తీరాలి! పెంతెకొస్తు దినాన పేతురు తన ప్రసంగంలో ఈ పాయింటునే చెప్పాడు: తాము ఎవరికొరకు యుగాలలో తరాల్లో కనిపెడుతున్నారో, ఆయన్నే యూదులు చంపారు!

## మరునిశ్చయత పొడిగింపబడింది (3:17-18)

వారు తమ దోషారోపణతో కుమిలిపోకుండేలా, వెంటనే పేతురు యిలా అన్నాడు: ''సహోదరులారా, మీరును మీ అధికారులును[12] తెలియక చేసితిరని నాకు తెలియును'' (17 వ.). పేతురు దయగా మాట్లాడాడు (మగాడి తనం కనుపరచడానికి నీచంగా ఉండనవసరం లేదు. నిజమైయుండడానికి తిరస్కరించ పనిలేదు). ఇంతకు పేతురు ఏమంటున్నాడంటే - ''యేసు ఎవరో మీరు నిజంగా ఎరిగియుంటే మీరు ఆయన్ను చంపుతారని నేను నమ్మను.'' అయినా పేతురు మాటలను అపార్థం చేసికోనవసరం లేదు. యేసు ఎవరో తెలిసికొనడానికి వారికి అవకాశం లేకుండా పోయిందని పేతురు అనడంలేదు. వారి అట్టి ఎరుగని స్థితి వారు తెచ్చుకొన్నదే; అది పరపక్షద్వేషబుద్ధివలన కలిగింది. లేదా వారి ఎరుగని స్థితి, వారిని తక్కువ దోషులుగా చేసిందని కూడా పేతురు అనడంలేదు. మారుమనస్సు పొందుడని అతడు వారి కాజ్ఞాపించాడు. కాని పేతురు చెప్పేదేమంటే - ''మీరు ఎరుగక చేశారు గనుక మీకు యింకా నిరీక్షణ ఉంది.'' ధర్మశాస్త్రం క్రింద తెలియకచేసిన పాపానికి, కావాలని చేసిన దానికిని మధ్య వ్యత్యాసం చూపబడుతుంది (లేవీ. 4; 5; సంఖ్యా. 15:22-31). తెలియక చేసిన పాపాలు పట్ల బలులు అర్పించవచ్చు; అట్టి పాపాలకు క్షమాపణ పొందవచ్చు. అయితే బుద్ధిపూర్వకంగా చేసిన పాపాలకు బలి ఉండదు.[13] తిరుగు బాటు చేసిన వానిని ప్రజలలోనుండి ''కొట్టివేయవలెను'' తరచుగా రాళ్లతోకొట్టి చంపుతారు. ''మీరు తెలియక చేశారన్న'' పేతురు మాటలు నిరీక్షణను కలిగించాయి.

అయినా ఎరుగమనే ముసుగు క్రింద కొనసాగవల్లపడదు. ''అయితే దేవుడు, తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను, ఈలాగు నెరవేర్చెను'' అని పేతురు అన్నాడు (18 వ.). వారు ప్రవక్తల లేఖనాలను సరిగా చదివియున్నట్లయితే, వారు ఎరుగని స్థితి నిజంగానే అంతరించిపోతుంది. క్రీస్తు వారి మెస్సీయా, శ్రమపడేవాడని వారికి అర్థమౌతుంది. యేసు శ్రమపడినప్పుడు, మెస్సీయాగా ఉండే అర్హతను పోగొట్టుకోలేదు. అది మెస్సీయాకు తప్పనిసరియైన యోగ్యతయైయుంది.[14]

## మారుమనస్సు కోరబడింది (3:19)

ప్రవక్తలనుగూర్చి పేతురు తెలుపకముందు, మారుమనస్సుపొంది, దేవునివైపుకు మరలవలసిందిగా తన శ్రోతలకు పిలుపునిచ్చాడు: ''మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తము మారుమనస్సునొంది తిరుగుడి'' (20b వ.).

12వ నుండి 26 వచనాలవరకు మన పాఠం ప్రారంభించినప్పుడు, ఇది ముగింపబడని ప్రసంగమని సూచించాను. 4వ అధ్యాయం మొదటి వచనంలో -

''వారు ప్రజలతో మాట్లాడుచుండగా ...'' అని చెప్పబడింది, పేతురు యోహానులు బంధింపబడ్డారు. అపొ. 2:38లో వలె ప్రభువువైపు తిరగడానికి ఏమి చేయాలో చెప్పే అవకాశం పేతురుకు లేకుండాపోయింది.[15] అయినా, పేతురుయొక్క 3:19-20ని అపొ. 2:38 ప్రక్కనుంచి చూడడం ప్రయోజనకరంగా ఉంటుంది:

| **అపొ. 2:38** | **అపొ. 3:19-20** |
|---|---|
| మారుమనస్సుపొంది | మారుమనస్సునొంది |
| మీలో ప్రతివాడును యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి | తిరుగుడి |
| పాపక్షమాపణనిమిత్తము | పాపములు తుడిచివేయబడు నిమిత్తం |
| పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు | ప్రభువు సముఖమునుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లు |

ఒకదాని ప్రక్కన మరొకటి పెట్టి చూస్తే, పోలికలు విదితమై యున్నాయి. రెండు లేఖనాలు మారుమనస్సుతో ప్రారంభింపబడ్డాయి. ''మారుమనస్సు'' అంటే - పాపమునకై పశ్చాత్తాపపడటం; పాపం పట్ల స్వభావాన్ని మార్చుకొనడం, వేరైన జీవితాన్ని జీవించడానికి తీర్మానించుకొనడం[16] The New Century Versionలో ''మీ హృదయాలు జీవితాలు మార్చుకోవాలి'' అని ఉంది. తన శ్రోతలు దేవుని సేవకుని, పరిశుద్ధుడును, నీతిమంతుడైనవానిని, జీవాధిపతిని (జీవానికి కర్తను) చంపారని పేతురు స్థాపించాడు! ఇలాటి హేయమైన పాపంనుండి వారు ముఖ్యంగా మొదట మారుమనస్సు పొందాలి!

తిరిగి, ఇరువైపులనున్న మూడవ భాగాన్ని గమనించు. 3:20లో ''మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తము'' అనే పదాలున్నాయి. ప్రాచీన రచనా పద్ధతినుండి ఈ పదప్రయోగం వచ్చింది. నేటి సిరాలా, ఆనాటి సిరాలో యాసిడ్ ఉండదు గనుక పేపిరస్‌లోనికి అది దిగదు. అందువలన వ్రాతపైనే నిలిచిపోతుంది. చాకుతో మెల్లగా గీకినా, లేక తడిగుడ్డ లేక స్పాంజితో దాని ఉపరితలాన్ని తుడిచినా, వ్రాతను తుడిచివేయవచ్చు[17] ఒకని పాపాలు తుడిచివేయబడాలంటే, దేవుని జ్ఞాపకార్థ గ్రంథంలోనుండి అవి తొలిగించబడాలి! 2:38లో చెప్పబడిన పాపక్షమాపణ అనేదికూడా అదే.

ఆ రెండు లేఖనభాగాల్లో ఒకటి, మూడు ఒకే విధంగా ఉన్నాయి గనుక, రెండు, నాల్గులుకూడా జతకూడే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ రెండింటిలో ఉన్న రెండో పాయింటును చూడు. ''మీలో ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము

పొందుడి'' అని ఉంది. 3:20లో కేవలం ''తిరుగుడి''[18] అని మాత్రమే ఉంది. యూదులు యేసును నిరాకరించినప్పుడు, దేవునియొక్క సంకల్పము, ఆయన ఏర్పాటులోనుండి తమ్మును తాము తొలగించుకొన్నారు. ఇప్పుడు యేసును అంగీకరించడం ద్వారానే తిరిగి వారు ప్రభువు[19] నొద్దకు రాగలుగుతారు. తిరిగి రమ్మనే ఆజ్ఞకును , బాప్తిస్మం పొందమనే ఆజ్ఞకు దగ్గర సంబంధం ఉందా? వారు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మం పొందాలి. వారు యేసునందు విశ్వాసముంచి, ఆయనను వారు మెస్సీయాగా అంగీకరించారనే దాన్ని వారి బాప్తిస్మం రుజువుపరుస్తుంది! ఈ రెండు లేఖనాల్లో ఉండే పోలికలనుబట్టి, ప్రభువునొద్దకు తిరిగి వచ్చేదానికి బాప్తిస్మం అత్యవసరమన్నట్టు తెలుస్తుంది.

చివరిగా, ఆ రెండు లేఖనభాగాల్లో ఉన్న నాల్గవ ప్రస్తావనను గమనించు. అపొ. 2:38లో - ''అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు'' అని ఉంది. 3:19లోనైతే, ''ప్రభువు సముఖమునుండి విశ్రాంతి[20]కాలములు వచ్చునట్లును'' అని వ్రాయబడింది. ''విశ్రాంతి కాలములు'' అనే ప్రయోగం, దేవుడు తన పిల్లలకు అనుగ్రహించే ఆత్మ సంబంధమైన దీవెనలను సూచిస్తుంది. (ప్రభువు మనతో ఉన్న కారణాన) అవి ప్రభువు సముఖమునుండి వస్తాయి. 2:38 ప్రకారం, మనం బాప్తిస్మం పొందినప్పుడు, దేవుడు తన పరిశుద్ధాత్మను మనకు దయచేస్తారు; దేవుని ఆత్మ మనలో నివసిస్తాడు![21] మనము ''ఆత్మ పూర్ణులమైనప్పుడు'' (ఎఫెసీ. 5:18), మన ఆత్మలు నిజంగా, ''విశ్రాంతి'' కాలాలను అనుభవిస్తాయి. యోహాను 7:37-39లో పరిశుద్ధాత్మ వరము - ''జీవజల నదులతో'' పోల్చబడింది! కొందరు క్రైస్తవ్యం బాధాకరమైనదని భావించారు, పేతురైతే, అది దీవెనకరమైనదని అంటాడు!

ఈ రెండు లేఖన భాగాలను మనం కలిపి ఆలోచించినప్పుడు, మనకు మూడు గొప్ప సత్యాలు లభించాయి: మనం మారుమనస్సు పొంది, దేవునివైపుకు (యొద్దకు) తిరిగినట్టయితే- బాప్తిస్మంతో కలిపి - మన పాపాలు క్షమించబడతాయి (తుడిచి వేయబడతాయి), దేవుడు మనలను దీవించి మన ఆత్మలకు - (మనలోనికి వచ్చి నివసించడం ద్వారా) విశ్రాంతి దయచేయబడుతుంది! 3:20లో తన శ్రోతలను యేసు నొద్దకు రమ్మని కోరడంలో దీవెనల్లో బహు ఆకర్షణీయమైన దాన్ని పేతురు వారికి ఎత్తి చూపాడు!

## పునరుత్థరణ వాగ్దానం చేయబడింది (3:20-21)

మనం రెండు దీవెనలను గుర్తించాం: పాపములు తుడిచివేయబడటం ఒకటి; విశ్రాంతి కాలాలు - రెండు.[22] 20-21 వచనాల్లో పేతురు మూడవ దీవెనను చేర్చాడు: ''మీకొరకు నియమించిన[23] యేసుక్రీస్తును ఆయన పంపునట్లును, పూర్వము దేవుడు తన ప్రవక్తలనోట పలికించినవన్నియు పునరుత్థరింపబడు కాలము వచ్చువరకు

పరలోకము ఆయనను చేర్చుకొనవలెను'' (KJV). తెలుగు తర్జుమా యిలా ఉంది: ''ప్రభువు సముఖమునుండి విశ్రాంతికాలములు వచ్చునట్లును, మీకొరకు నియమించిన క్రీస్తుయేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సునొంది తిరుగుడి. అన్నిటికి కుదురుబాటు కాలములు వచ్చునని దేవుడు ఆదినుండి తన పరిశుద్ధ ప్రవక్తలనోట పలికెను. అంతవరకు యేసు పరలోక నివాసియైయుండుట అవశ్యకము'' (19-21 వచ.). ''నీవు ప్రకటించే ఆ యేసుక్రీస్తు ఏడి?'' అనే సందేహం తన శ్రోతల్లో ఎవరికైనా వస్తే - ''ఆయన పరలోకంలో ఉన్నారు'' తన శత్రువులను ఆయనకు పాదపీఠంగా చేసేవరకు తన కుడిపార్శ్వమున కూర్చుండుమని దేవుడు ఆయనకు సెలవిచ్చారు అన్నట్టు పేతురుయొక్క వర్తమానముంది.

పేతురు తన శ్రోతలకు తెలియజేసే మూడవ దీవెన - క్రీస్తుయొక్క రెండవరాకడ! ప్రభువుయొక్క రెండవ రాకడనుగూర్చి నీవు ఉత్సహించుతావో, లేదోకాని, ఆ విషయానిగూర్చి మొదటి శతాబ్దపు క్రైస్తవులు ఉప్పొంగిపోయేవారు. వారి శ్రమానుభవంలో, క్రీస్తువచ్చి సమస్తాన్ని చక్కపరుస్తారని వారు వాంఛించారు!

''సమస్తము పునరుద్ధరింపబడు కాలమువరకు'' అనే మాటలు బహుగా అపార్థం చేయబడ్డాయి. ''అన్నిటికి కుదురుబాటు కాలమువచ్చునని'' KJVలో ఉంది.[24] NIVలో మాత్రం ''దేవుడు ప్రతిదానిని చక్కపరచే కాలము వచ్చేవరకు'' అని అంటుంది. పేతురుయొక్క భావమేమో తెలపడానికి కొందరు పెద్ద సిద్ధాంతాలను తయారుచేశారు. మానవాళి దేవునివైపు తిరిగి, ఆత్మసంబంధమైన సువర్ణయుగం వెలసేవరకు క్రీస్తురారు అని కొందరు ప్రకటించారు.[25] యేసు భూమిమీదికి వచ్చిన తరువాత దీనిని పరదైసులా చేస్తారని చెప్పుతున్నారు.[26] అయితే యిక్కడ, పేతురు ఉలికిపడే ఏ వింతైన క్రొత్త ప్రత్యక్షతనుగూర్చి తెలపడంలేదు. ''సమస్త కార్యాలు'' చక్కపరచబడతాయని పేతురు అన్నప్పుడు, అతడు కేవలం, యూదుల జాతీయాన్ని లేదా, భాషా సాంప్రదాయాన్నే ఉపయోగించాడు.

యూదులైన శ్రోతలకు[27] ''అన్నిటికి కుదురుబాటుకాలం'' అంటే - మెస్సీయాకు సంబంధించిన పదజాలమే! మెస్సీయా వచ్చినప్పుడు ''సమస్తాన్ని చక్కపర్చుతారు'' అనేది వారి భావన. అయితే, అతని శ్రోతలు ఆ మాటలు వినగానే వాటిని సరిగా గ్రహించారని దాని భావం కాదు. ''ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?'' అని అపొస్తలు అడిగినట్టు (1:6), తాత్కాలికమైన, భౌతికమైన జాతీయరాజ్యం పునరుద్ధరణే వారి మనస్సులో ఉండియుండవచ్చు. దావీదు, సొలొమోనుల రాజ్యకాలంలో ఇశ్రాయేలీయులకున్న ఘనత పునరుద్ధరింపబడాలని వారు కనిపెట్టుతూ ఉండవచ్చు. వారి తప్పుడు భావాన్ని దిద్దాలనేది పేతురుయొక్క ఉద్దేశంకాదు.[28] కాని, ఆయన రెండవసారి ప్రత్యక్షమై

నప్పుడు, మెస్సీయా అనుగ్రహించబోయే[29] దానినంతటిని అనుభవించేలా, యేసును మెస్సీయాగా వారు అంగీకరించాలని పేతురు కోరాడు.[30] తమ జీవితాల్లో మెస్సీయా మీద గురిపెట్టుకున్న వారిని మళ్లించడానికి శక్తివంతంగా యిది పనిచేస్తుంది.

యూదులైన శ్రోతలకు 20-21వ వచనాల్లో పేతురుయొక్క మాటలు కలిగించే విశేషమే అది. బైబిలు బోధను మొత్తంగా పొందే అవకాశమున్న క్రైస్తవులకు అవి ఎలా స్ఫురిస్తాయో? పేతురు మాటల్లో ఒక ప్రాథమిక సత్యం నొక్కి చెప్పబడింది: ఏమంటే క్రీస్తు వచ్చేవరకు ప్రతిదీ సక్రమంగా మారిపోదు. కొన్ని విషయాలు నేడు సరిచేయబడ్డాయి. దేవుడు మన పాపాలను క్షమించారు; ఆయన మనతో ఉండి మన జీవిత శ్రమలో మనకు సహాయం చేస్తారు. మనం పాప భూయిష్టమైన లోకంలో జీవిస్తున్నాం. నీతిమంతులు శ్రమలు పడుతూ ఉంటే, దుష్టులు వర్ధిల్లడం తరచుగా కన్పిస్తుంది. హెచ్చు తగ్గులు ఉన్నాయి. అవి ప్రభువు ప్రత్యక్షమయ్యేవరకు ఉంటాయి. ఆ సమయంలో, New Century Versionలో ఉన్న పదాలను ఉపయోగించితే, ''సమస్త విషయాలు తిరిగి చక్కచేయబడ[31]తాయి.''

''అన్నిటిని పునరుద్ధరించే'' అనే పదాలను అభినందించగల ఉత్తమమైన మార్గమేమంటే - ఆదికాండం మొదటి అధ్యాయాన్ని, ప్రకటన చివరిరెండు అధ్యాయాలకు పోల్చి చూడటమే. ఆదికాండంలో, తన సృష్టికర్తనుండి పాపం నరుని వేరుచేసే వరకు దైవమానవులు కలిసి నడిచారు. ప్రకటన 21:3లో అలాటి దగ్గర సంబంధం పునరుద్ధరింపబడింది. ఆదికాండంలో నరుడు జీవవృక్షఫలాలకు హక్కును కోల్పోయాడు; ప్రకటన 22:2లో ఆ హక్కును నరుడు తిరిగి పొందాడు. ఆదికాండంలో నరుడు పరదైసును కోల్పోయాడు, ప్రకటన 22:1-2ల్లో పరదైసును తిరిగి పొందాడు. ఆదికాండంలో మరణం లోకాన్ని బంధించింది; ప్రకటనలో మరణం రద్దుచేయబడింది (21:4). పునరుద్ధరించబడేదంతా,[32] తనకు నమ్మకస్థులైన[33] వారికి పునరుద్ధరించబడుతుంది యేసువచ్చి తనవారిని తనతో ఉండడానికి కొనిపోయినప్పుడు (యోహాను 14:3). ప్రభువుయొక్క ఆగమనంకొరకు నిరంతరం సిద్ధంగా ఉండేలా అది ఎలాటి ప్రేరేపణో!

## విమోచకుడు ప్రవచింపబడ్డారు (3:22-24)

పేతురు ప్రవక్తలను పలుమార్లు ప్రస్తావించాడు (18, 21 వచ.). తదుపరి[34] మోషేతో చేర్చి, మెస్సీయానుగూర్చి పలికిన ప్రవక్తలను పేతురు తెలిపాడు:

> మోషే యిట్లనెను - ''ప్రభువైన దేవుడు నావంటి యొక ప్రవక్తను మీ సహోదరులలోనుండి మీకొరకు పుట్టించును; ఆయన మీతో ఏమి చెప్పినను అన్ని విషయములలో మీరాయన మాట వినవలెను. ఆ ప్రవక్తమాట విననివాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశనమగుననెను'' (22-23 వచ.).

ఈ మాటలు పేతురు శ్రోతలకు పరిచయమైన - ద్వితీయోప దేశకాండం 18, లేవీయకాండం 23[35] ల నుండి చూపబడ్డాయి. ''ఆ ప్రవక్త'' యొక్క రాకకై యూదులు కనిపెట్టారు అతడు మోషేవలె నాయకుడు, చట్టాన్ని యిచ్చేవాడు, ఏలిక, విమోచకుడు.[36]

బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చినప్పుడు, ''నీవు ఆ ప్రవక్తవా?'' అని వారు విచారించారు (యోహాను 1:21). ప్రభువైన యేసు 5000 మందికి ఆహారం పెట్టినప్పుడు ''నిజముగా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త ఈయనే అని చెప్పుకొనిరి'' (యోహాను 6:14). ఆ ప్రవక్త యేసేనని పేతురు తెలిపి, ''ఆ ప్రవక్తమాట విననివాడు ప్రజలలో ఉండకుండ సర్వనాశనమగునని'' నొక్కి చెప్పినట్టున్నాడు. యేసునుగూర్చి వారు తీక్షణంగా పట్టించుకోకుండా ఉంటే, వారు నాశనం చేయబడతారు!

తరువాత, విమోచకునిగూర్చి యితర ప్రవక్తల ఉపదేశాన్ని క్లుప్తంగా పేతురు తెలియజేశాడు! ''మరియు సమూయేలు[37] మొదలుకొని యెందరు ప్రవక్తలు ప్రవచించిరో వారందరు ఈ దినమును గూర్చి ప్రకటించిరి'' (24 వ.). సమూయేలు దావీదును అభిషేకించి, రాజ్యస్థాపనను గూర్చి పలికినప్పుడు, 2 సమూ. 7:8-17లో, ప్రవక్తయొక్క పలుకులు మెస్సీయాకు సంబంధించిన నిబంధనగా అవి కనిపెట్ట బడ్డాయి. సమూయేలు తరువాత వచ్చిన వారినిగూర్చి, పేతురు ఉదాహరణ వెంట ఉదాహరణ నివ్వగలడు.[38] యేసునుగూర్చి పాతనిబంధనలో మూడు వందల కంటె ఎక్కువ ప్రవచనాలు పలుకబడ్డాయి![39]

## ప్రకటన ఆటంకపరచబడింది (3:25-26)

ఇంతలో, స్వస్థపరచబడిన కుంటివాని విషయం, దానివెంట జరిగిన సంగతులను గూర్చిన సమాచారం, యూదా మతనాయకులకు పిర్యాదు చేయబడింది. వారు పేతురు ప్రసంగాన్ని నిలుపుచేయడానికి గాను అన్యజనుల ప్రాంగణంలోనికి త్వరపడి వచ్చారు. బోధించడానికి పేతురుకు యిక సెకండ్లు మాత్రమే మిగిలినట్టున్నాయి. తన శ్రోతలైనవారికి పేతురు వ్యక్తిగతంగా తన వర్తమానాన్ని వర్తింపజేశాడు. 25-26 వచనాల్లో, కనీసం ఆరుసార్లుయినా, ''మీరు,'' ''మీ'' అనే పదాన్ని పేతురు వినియోగించాడు. ''మీరు'', ''మీ'' అనే మాటలు నొక్కి పలుకుతూ, ఈ లేఖన భాగంయొక్క భావాన్ని గుర్తించడానికి గాను కొంచెం పెద్దగా చదువు.

> ఆ ప్రవక్తలకును, దేవుడు అబ్రాహాముతో - నీ సంతానమందు భూలోక వంశము లన్నియు ఆశీర్వదింపబడునని చెప్పి మీ పితరులతో చేసిన నిబంధనకును మీరు వారసులైయున్నారు. దేవుడు తన సేవకుని పుట్టించి, మీలో ప్రతివానిని వాని దుష్టత్వమునుండి మళ్లించుటవలన మిమ్మును ఆశీర్వదించుటకు ఆయనను మొదట మీయొద్దకు పంపెనని చెప్పెను (25-26 వచ.).

''ఆ ప్రవక్తలకు'' - ''మీరు వారసులైయున్నారు'' - అని పేతురు తన శ్రోతలకు తెలియజేశాడు. దైవ ప్రవక్తలు యూదులకొరకే మెస్సీయాను గూర్చి ప్రవచనాలను లిఖించారు.  ఈ వందలకొలది ప్రవచనాలు యేసుమీద ప్రకాశిస్తున్న గొప్ప కారులైట్లవలె ఉన్నాయి అయినా యూదులు ఆయన్ను చూడలేకున్నారు!

తరువాత పేతురు యూదులకున్న మరొక అనుకూల పరిస్థితిని గూర్చి జ్ఞాపకం చేశాడు. అది పూర్వమందు చేయబడిన వాగ్దానం! - ''నీ సంతానమందు భూలోక వంశములన్నియు[40] ఆశీర్వదింపబడునని (అబ్రాహాముతో చెప్పి) మీ పితరులతో చేసిన నిబంధనకు మీరు వారసులైయున్నారు'' (25 వ.). ఈ ప్రవచనం ఆది. 22:18లో ఉంది. ఇది క్రీస్తుయొక్క రాకనుగూర్చి సూచిస్తుంది. పౌలు తరువాత ఆది. 22 నుండి సంగతి యిలా వివరించాడు: ''అబ్రాహామునకును అతని సంతానము నకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులనుగూర్చి అన్నట్టు - నీ సంతానములకును అని చెప్పక, ఒకనిగూర్చి అన్నట్టే - నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తే'' (గలతీ. 3:16). పేతురుయొక్క శ్రోతలు, ఆది. 22లోని వాగ్దానాన్ని ఎరుగనివారు కారు. మెస్సీయా వచ్చినప్పుడు జనులందరిలో ఆయన్ను గుర్తింపవలసివారు వారే, గాని వారాయనను గుర్తించలేదు.

యూదులు దేవుని ప్రవక్తలను తేలిగ్గా తలంచారు; దేవుని వాగ్దానాలను అలక్ష్యం చేశారు. వారిని విసర్జించడానికి దేవునికి సర్వహక్కులున్నాయి, అయినా దేవుడు తన ప్రజలను విసర్జించినవారు కారు. దేవుడు కృపగల దేవుడు, తన నిబంధన జనులకు ఆయన సమస్తం జరిగించారు. పైగా ఆయన వారికి మరో తరుణం అనుగ్రహించారు. ''దేవుడు తన సేవకుని పుట్టించి, మీలో ప్రతివానిని వాని దుష్టత్వము నుండి మళ్లించుటవలన మిమ్మును ఆశీర్వదించుటకు ఆయన  మొదట మీయొద్దకు పంపెనని చెప్పెను'' (26 వ.). ''మొదట'' అనే మాటలో - దేవుని దీవెలకు అన్యజనులు సహితం వారితో చేర్చబడతారని సూచింపబడింది.[41] అయితే యూదుల దీవెనకు పునరుత్థానం ఉద్దేశింపబడినట్టు, యూదులు తమ దుష్టత్వంనుండి మళ్లించడానికి యేసును యూదులలోనికి పంపినట్టు పేతురు సూచించాడు. ''మీలో ప్రతివానిని వాని దుష్టత్వంనుండి మళ్లించుటకు'' అనే దానిలో వ్యక్తిగతమైన వర్తింపును నొక్కి చెప్పుతున్నాడు, గమనించు. జాతీయంగా వారు బలం పుంజుకోవాలంటే, వ్యక్తులుగా వారు పునరుత్థరింపబడాలి![42]

వారేమి చేయాలో ఆ వివరాలను కలుపుతూ 19-20వచనాల్లో సంగతిని తిరిగి చెప్పడానికి పేతురుకు యిది సహజమైన స్థలమైయుండేదే. ''ఇంకను అనేక విధములైన మాటలతో వారిని హెచ్చరించి, యేసునందలి విధేయతతోకూడిన విశ్వాసానికి మళ్లించడానికికూడా అదే'' (2:40). అయితే సమయం దొరుకకుండాపోయింది. ''వారు ప్రజలతో మాటలాడుచుండగా, యాజకులును దేవాలయపు అధిపతియు

సద్దూకయ్యులును ... వారి మీదికి వచ్చి, వారిని బలత్కారముగా పట్టుకొని, సాయంకాలమైనందున మరునాటివరకు వారిని కావలిలో ఉంచిరి'' (4:1-3) అని వ్రాయబడింది.

యూదామత నాయకులు అపొస్తలులను చెరసాలలో వేయగలిగారే గాని, వారి మాటలను బంధించడం వారివలన కాకపోయింది - ''వాక్యము వినిన వారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య యించుమించు అయిదువేలు ఆయెను'' అని తరువాత అధ్యాయం చెప్తుంది (4:4) ఆ అయిదు వేలమందిలో ఒకడు - గతంలో భిక్షగాడైయుండి, కేవలం తన శరీరంలోనేగాక, తన ఆత్మయందును స్వస్థత నొందినవాడని నేను ఊహిస్తున్నాను!

## ముగింపు

సన్‌హెడ్రిన్ ఎదుట పేతురు యోహానులు నిలచి చెప్పిన సంగతులను ఆలోచించేటప్పుడు ''యేసు నామము''ను ఒత్తి పలకడాన్నిగూర్చి తరువాత పాఠంలో కొనసాగించుదాం. ఇంతటితో దీన్ని ముగించుదాం. ఇలా ముగించేటప్పుడు - 3వ అధ్యాయం తొలిభాగంలో[43] పేతురు యోహానును - ఆ భిక్షగానిని బాగుచేసినప్పుడు జరిగించిన దానికిని, ప్రజలకు వారు బోధించినప్పుడు చేసిన దానికిని మధ్య సమాంతరాలను గుర్తింపకోరతాను. ఈ రెండింటికి మధ్యగల సంబంధం, నాల్గవ అధ్యాయంలో పుట్టు కుంటివానిని గూర్చి పేతురు వివరించినప్పుడు నొక్కి చెప్పబడింది.

> ప్రజల అధికారులారా, పెద్దలారా, ఆ దుర్బలునికి చేయబడిన ఉపకారమునుగూర్చి వాడు దేనివలన స్వస్థత పొందెనని నేడు మమ్మును విమర్శించుచున్నారు గనుక, మీరందరును ఇశ్రాయేలు ప్రజలందరును తెలిసికొనవలసినదేమనగా, మీరు సిలువవేసినట్టియు, మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసు క్రీస్తు నామముననే వీడు స్వస్థతపొంది మీ యెదుట నిలుచుచున్నాడు ... మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశముక్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమునను రక్షణ పొందలేము అనెను (4:9-10, 12).

9వ వచనంలో ''స్వస్థతపొందుట,'' ... 12వ వచనంలో ''రక్షణపొందుట'' అనే పదాలు ఒకే మూలంనుండి వచ్చాయి. దేహంలో ఆ భిక్షగానిని స్వస్థపరచిన యేసే, ఆత్మసంబంధంగా వారిని స్వస్థపరచగలడన్న వాస్తవాన్ని తన శ్రోతలు తెలిసికోవాలని పేతురు కోరాడు! దాన్నే మరో విధంగా చెప్పాలంటే - కుంటివానిని భౌతిక అస్వస్థత నుండి బాగుచేయగలిగిన యేసు ఆత్మసంబంధమైన వారి పాపరోగంనుండి రక్షించ గలడు. యూదులు ఆ మార్గానపోతూ, ఆ భిక్షగానివైపు చూచినప్పుడు, వంకర తిరిగిన వాని కాళ్లను చూచి నొచ్చుకొనియుంటారు. అయితే

అతని కాళ్లు ఎలా వంకర తిరిగి, వికారంగా, శక్తిహీనమైనవిగా ఉన్నాయో, వారి ఆత్మలుకూడా అలాటి దుస్థితిలోనే ఉన్నట్టు, గుర్తించవలసిందిగా పేతురు తన శ్రోతలను కోరాడు. అంటే - ఒక వ్యక్తికి జరిగిన దేహస్వస్థత, అనేక ఆత్మలు స్వస్థపరచబడడానికి జరిగిందన్నమాటే, నీ ఆత్మ స్వస్థపరచబడేలా, ప్రభువుకు నీవు అవకాశం గతంలో యివ్వకుంటే, ఇదే అనుకూల సమయం.

## దక్ష్యో సాధనాకకూచనకు

2:38కిని 3:19-20కిని ఉన్న సమాంతరాలు నల్లబల్లమీద వ్రాయవచ్చు. పాపములు తుడిచివేయబడటాన్ని ''పాపములు'' అని బోర్డుమీద వ్రాసి-వాటిని తుడిచివేయవచ్చు. తుడిచివేయబడడమనే దానికి మరో ఉదాహరణ: మట్టితో అక్షరాలను చెక్కే ఒక పలకచేసికొని, ''పాపములు'' అనే మాటలు దానిమీద పుల్లతో వ్రాసి, ఆ తరువాత దాన్ని గీకివేయవచ్చు. మీ ప్రాంతంలో అది దొరిగితే - MAGIC SLATE కొని దానిమీద ''పాపములు'' అని రాసి, తిరిగి తుడిచివేయవచ్చు.

## ప్రసంగ సూచనలు

అపొ. 2-3ల్లో కుదించబడిన ప్రసంగాలున్నాయని నేను చెప్పాను. పైగా ఒక దానిలోని వివరాలు మరో దానిలో చేర్చకుండ దాఖలు చేయబడ్డాయని కూడా సూచించాను. (లూకా, సహజంగానే, ఒకచోట ఉన్న వివరాలను మరోచోట యివ్వకుండ ఉండేలా శ్రద్ధ వహించినట్టున్నాడు). ''పేతురు ప్రసంగించిన సువార్త'' అనే పాఠాన్ని 2, 3 అధ్యాయాల కలయికతో తయారుచేయవచ్చు. అలాగే అపొ. 4, 10లోకూడ. అవసరమైనంతవరకు కొద్దిసంగతులు చెప్పుకొంటూపోవచ్చు. పేతురు ప్రసంగించింది శక్తివంతమైన పాఠమైయుండాలి. అది వేలకొలదిమందిని కదిలించిన వర్తమానం!

''మోషేవంటి ప్రవక్త'' (ద్వితీయో. 18:15, 18-19; లేవీ. 23:29; అపొ. 3:22-23) అనే అంశంమీద ఆసక్తిని పుట్టించే ప్రసంగం చేయవచ్చు. హెబ్రీ గ్రంథంమీద Coffman రాసిన వ్యాఖ్యానంలో 19 విషయాల్లో యేసు మోషేవలె ఉన్నట్టును, 13 విషయాల్లో ఆయన మోషేవలె లేనట్టును - పట్టీవేశాడు (Coffman,

*Commentary on Hebrews* [Austin, Tex.: Firm Foundation Publishing House, 1971], 67-69).

---

సూచనలు

[1]ప్రేమ పిచ్చిలో పడిన యువకునిగాని, యువతినిగాని తలంచడం యుక్తమనుకుంటే- అతడుగాని, ఆమెగాని తన ప్రియుని (లేక ప్రేయసి) పేరు మాటిమాటికి వ్రాస్తూ ఉంటారు. ఆ వ్యక్తికి ఆ పేరు కేవలం అక్షరాల కూర్పు మాత్రేకాదు. తన హృదయస్పందన జరిగించే వ్యక్తిని అవి సూచిస్తాయి. [2]అపొ. 2-3 అధ్యాయాల్లోని ప్రసంగాలు ఒకదానినొకటి బలపరచుకొంటున్నాయి. రెండు ప్రసంగాలలోకూడా పేతురు కొంత ఒకే రకమైన సమాచారాన్ని ప్రయోగించియుండవచ్చు. అయితే లూకాయొక్క విధానం వర్తమానాన్ని నకిలీగా దాఖలు చేయకూడదన్నట్టు ఉంటుంది. [3]KJVలో ''పరిశుద్ధత'' అని ఉంది; NIVలో ''మంచితనం'' అని ఉంది. [4]KJVలో ''కుమారుడని'' యిక్కడ, యింకా 26వచనంలోను ఉంది. గ్రీకులో ఉపయోగింపబడిన పదం సాధారణంగా ''కుమారుడు'' (*huios*) అనేది కాదు లేక సాధారణంగా ''సేవకుడు'' (*diakonos*) అనే పదంకూడా కాదు. అది "*pais*" అనే పదం - దానికి ''సేవకుడు'' అనిగాని, లేక ''బిడ్డ'' అనిగాని భావం అయ్యుండవచ్చు. (ఈ పదంనుండే "pediatrician" - పిల్లల వైద్యుడు అనేపదం వచ్చింది). యేసుయొక్క శ్రమలను గూర్చి పేతురు నొక్కి చెప్పినందున (18 వ.), పాతనిబంధనలోని ''శ్రమపడు సేవకుడు'' అనే సందేశాన్ని అతడు చూపినట్టున్నాడు. అందువలన నవీన తర్జుమాల్లో ఎక్కువభాగం ''సేవకుడు'' అనే పదాన్నే యిష్టపడతారు. [5]యెషయా 53; అపొ. 8లో ఐతియోపీయుల (నపుంశకునికి) ఫిలిప్పు చేసిన ప్రసంగాన్ని గమనించు. [6]కీర్తనలు 22, పేతురుయొక్క ప్రసంగం క్లుప్తీకరింపబడిన రూపంలో ఉన్నందున, పేతురు యిక్కడ ఆగి, యెషయానుండి, దావీదునుండి కొన్ని గొప్ప లేఖన భాగాలను ఎత్తిచూపే అవకాశముంది. [7]వారి విమోచకునే వారు అప్పగించారు. [8]''పరిశుద్ధుడు'' అనేది ''ప్రతిష్ఠించబడి'' లేక ''ప్రత్యేకపరచబడి'' అనే అర్థమిచ్చే గ్రీకు మూలంనుండి తర్జుమాచేయబడింది. అది నరులకు వర్తింపజేయబడినప్పుడు, దేవుడు తన పిల్లలను ప్రత్యేకమైన పనికొరకు వేరుచేసికొన్నారని భావం. అయితే అదే పదం దేవునికి వర్తింపజేయబడినప్పుడు, దేవుని సర్వపరిపూర్ణత, అయనను తన సృష్టినుండి ఆయన్ను ప్రత్యేకించింది - అని భావం. [9]''నీతిమంతుడు'' అనే పదం - ఏ నేరము లేక దోషములేనివాడు, (నిర్దోషి నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా నున్నవాడు) అని సూచిస్తుంది. [10]పేతురుకూడా యేసును ''దేవుని పరిశుద్ధుడని'' ఒప్పుకొన్నాడు (యోహాను 6:69).

[11]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary*, vol.1 (Wheaton, Ill.: Victor Books, 1989), 412. [12]అధికారులు తెలియక చేశారనే దానికి 13:27; 1 కొరింథీ. 2:8లను చూడు. [13] హెబ్రీ. 10:26ను గమనించు. వాటిని బుద్ధిపూర్వకమైన పాపాలని హెబ్రీ రచయిత అన్నాడు. [14]పేతురుయొక్క తొలి ప్రసంగంలో ముఖ్యమైన పాయింటు యిదే. ఎందుకంటే, యేసును మెస్సీయాగా అంగీకరించకుండ అడ్డుగా నిలిచింది ఆయన సిలువ మరణమే. [15]యెరూషలేములో అనుదినం క్రీస్తును ఒప్పుకొంటూ బాప్తిస్మం పొందడం జరుగుతున్న కారణాన, ఆ సంగతులు చెప్పనవసరంలేదని కొందరు వ్యాఖ్యాన కర్తలన్నారు (2:38, 41, 47). [16]మారుమనస్సు అనే దానికి గ్లోసరీలో చూడు. [17]జనులు బంకమట్టిమీదగాని, మైనపు పలకలమీదగాని పదునైన ముక్కుగల పుల్లతో వ్రాస్తారు. ఉపరితలాన్ని నున్నగా రుద్దినట్టయితే వాటిమీద వ్రాతకూడా తొలిగింపబడుతుంది. [18]అసలైన గ్రీకు పదం సంయుక్త పదం- దానికి ''వైపుకు తిరుగు'' అనేది అర్థం. [19]దేనికి లేక ఎవరి యొద్దకు తిరగాలనేది ఆ లేఖనంలో చెప్పబడలేదు. అయితే ప్రభువువైపుకు ''తిరుగ''మనేది అందులో విదితమే (11:21 గమనించు). New Century Versionలో ''దేవునివైపుకు రండనే'' అజ్ఞ ఉంది. [20]ఇది పాపక్షమాపణతో ప్రారంభమౌతుంది. భయంకరమైన దోషారోపణ మన హృదయాల్లోనుండి తొలగించబడినప్పుడు, ఆత్మలను బ్రద్దలుగా కోసినవేదన తొలగింపబడుతుంది. ప్రభువు సముఖంనుండి విశ్రాంతికాలములు వచ్చేది అప్పుడే ఇవి క్రైస్తవ జీవితమంతటిలో కొనసాగుతాయి, మనం సమస్యలతో సతమతమౌతూ, చివరికి వాటిని ప్రభువునకు అప్పగించినప్పుడు. మన ఆత్మలను ఆయన ఎంతగా సేదదీర్చుతారో! యేసు పిలుపు విశ్రాంతిని ప్రసాదించే పిలుపే (మత్తయి 11:28-29).

[21]అపొ. 2లో ''పరిశుద్ధాత్మయొక్క పని అనే వ్యాసాన్ని చూడు.'' ''పరిశుద్ధాత్మ ఏమి చేస్తారు?'' అనే వ్యాసాన్ని వచ్చే సంచికలో చూడు. [22]ఈ రెండు దీవెనలను KJVయిలా చూపింది. [23]''నియమించిన'' అనేపదం - ''ముందుగానే నియమింపబడిన'' అని అర్థమిచ్చే గ్రీకుపదంనుండి తర్జుమాచేయబడింది. గతంలో ఎప్పుడో, తన సంకల్పంలో

భాగంగా, దేవుడు యేసును మెస్సీయాగా నియమించారు. ''మీ కొరకు'' - అనేది - వ్యక్తిగతంగా చెందేది - అందువలన, తన శ్రోతలను ఉద్దేశించి, దేవుడు ప్రత్యేకంగా ఈ పనిని వారికొరకు చేసినట్టు వర్తింపజేస్తున్నాడు. [24]అక్షరార్థమైన తర్జుమాకు **KJV** దగ్గరగా ఉంది. [25]పాపభూయిష్టమైన ఈ భూమిమీద ఆత్మసంబంధమైన స్వర్ణయుగం వెలుస్తుందని ఏ సూచనాలేదు. ఆయన వచ్చునప్పుడు అసలు భూమిమీద విశ్వాసముంచడం కనుగొంటానా అని యేసు ఆశ్చర్యంగా పలికారు (లూకా 18:8). [26]ఈ సంగతులను చెప్పేవారు అలంకార రూపంగా బైబిల్లో చెప్పిన సంగతులను అక్షరార్థంగా మార్చి అలా చెప్పుతున్నారు. [27]''మొట్టమొదట ఆ మాటలు విన్నవారికి అవి ఎలా గోచరించాయి?'' అనేది బైబిలు వ్యాఖ్యానంలో ప్రాథమికమైన ప్రశ్న. [28]వారు క్రైస్తవులై, సంగతులు నేర్చుకొంటూ ఉంటే, రాజ్యాన్నిగూర్చి అపొస్తలులకున్న అపార్థాలు ఎలా దిద్దబడ్డాయో, అలాగే వీరి అపార్థాలూకూడా దిద్దబడతాయి. [29]''న్యాయసమ్మతమైన'' కోర్కెలు తీర్చబడతాయి - మెస్సీయానుగూర్చి ప్రవక్తలు చెప్పినవాటికి వారు తమ సొంత ఆశలతో రంగులు దిద్దారు. ప్రభువు రాకడలో పొందబోయేది భూమిమీద వారు ఎదురుచూచేదికాదు. [30]వారి జాతీయమైన నిరీక్షణను పేతురు వ్యక్తిగతమైన నిరీక్షణకు మల్చుతున్నాడు.

[31]''సమస్త విషయాలు పునరుద్ధరించబడే'' కార్యాక్రమం- బాప్తిస్మమిచ్చు యోహాను పనితో ప్రారంభమయ్యింది. అతడు మెస్సీయాకు మార్గం సిద్ధపరచ వచ్చాడు (మలాకి 3:1; 4:5-6; మత్తయి 17:11-12; మార్కు 9:12-13) . యేసుక్రీస్తుయొక్క బలియాగం ద్వారా దేవునితో నరులు సమాధానపరచబడటంలో, పని కొనసాగింది (ఎఫెసీ. 2:16-18). అయినా ఈ పునరుద్ధరణ కార్యక్రమంయొక్క ముగింపుకు ప్రభువు తిరిగి ప్రత్యక్షమయ్యేవరకు వేచియుండవలసిందే. [32]దిద్దబడాలని మనం అక్కర కలిగియుండేదంతా ఎక్కువ ప్రాముఖ్యమైనదికాదు. నిత్యసంకల్పంలో అలాటి అక్కరలు ప్రాముఖ్యమైనవి కానట్టు మనం చూస్తాం. [33]దీన్ని వ్యక్తిగతమయ్యిందిగా చూడు: కొందరు ఆరోగ్యాన్ని కొల్పోయారు, అది దిద్దబడింది. కొందరు ఆస్తులను కోల్పోయారు; పరలోకపు ధనాన్ని పొందుతారు. కొందరు స్నేహితులను, బందుజనాన్ని పోగొట్టుకున్నారు; వారు దేవునితో, క్రీస్తుతో, పరిశుద్ధాత్మతో, దేవదూతలతో, పరిశుద్ధు లందరితో ఉంటారు. [34]యూదా 14-15వచనాల్లో హానోకు ప్రవక్తయని పిలువబడ్డాడు. కాని యూదులకు మాత్రం మోషేమొదటివాడు, ప్రవక్తల్లో అగ్రగణ్యుడు. ''యేసు ఎమ్మాయి మార్గంలో యిద్దరికి బోధించినప్పుడు, మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని'' అని ప్రారంభించారు (లూకా 24:27). [35]పై కొటేషన్‌లో ఎక్కువ భాగం - ద్వితీయో. 18:15, 18-19ల్లోనుండి తీయబడింది. ఆ కొటేషన్‌యొక్క అంతంలో పదరూపం లేవీ. 23:29నుండి తీయబడింది. ఈ రెండు రచనలను మోషేయే వ్రాశాడు. [36]ద్వితీయో. 18లో, దేవుని చిత్తాన్ని తెలిసికొనడానికిగాను, ఇశ్రాయేలీయులు కనానీయులవలె - మంత్ర సంబంధమైన విద్యలవైపుకు మరలవద్దని మోషే వారిని హెచ్చరించాడు. తన చిత్తాన్ని తెలియజేయడానికిగాను ఎల్లవేళల తన ప్రతినిధిని ఒకని దేవుడు నిలుపుతారని; ఆయన మోషేని లేపినట్టే- అతనివంటి మరొక ప్రవక్తను పుట్టిస్తారని వాగ్దానం చేశారు. దేవుడు తన వాగ్దానాన్ని నిలుపుకున్నారు; ప్రేరేపింపబడిన వర్తమానికుడు లేకుండ దేవుడు తన ప్రజలను విడువలేదని మోషే తెలిపాడు. మోషే వారి దృష్టిలో ఎంత ప్రత్యేకమైన వాడంటే - ఆ తరువాత వచ్చిన ప్రవక్తలు పాక్షికంగానే ఆ ప్రవచనాన్ని నెరవేర్చారని - మోషేప్రవచించిన ''ఆ ప్రవక్త'' యింకా రావాలని వారాదినాల్లో కనిపెట్టే ఉన్నారు. [37]13:20ని చూడు. ''ప్రకటించిన ప్రవక్తలలో'' కొన్నిసార్లు సమూయేలు మొదటివాడనబడ్డాడు. [38]1 సమూయేలు 13:14; 15:28; 16:13; 28:17లను చూడు. [39]పాతనిబంధనలోని ప్రవక్తలనుండి ప్రత్యేకించి చూపే మెస్సీయా ప్రవచనం విషయంలో అక్కర కలిగియున్నారు. అలాటిది ఆ రచయితలకు అవసరంలేదు. మెస్సీయా రాకకు ప్రతి ప్రవక్త తనవంతులో తాను ఏదో కొంత సమర్పించడం జరిగింది. అందువలన యేసు - ''మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్నుగూర్చిన వచనముల భావమును వారికి తెలిపెను'' అని వ్రాయబడింది (లూకా 24:27).

[40]క్రైస్తవ యుగంలో యూదులతోపాటు అన్యజనులుకూడా పాలివారు కాబోతారని కనిపెట్టిన గొప్ప పాతనిబంధన వాగ్దానాలలో యిది ఒకటి. అయినా, పేతురు దీన్ని గ్రహించలేదు. ఆ వాగ్దానాన్ని అతడు ఆలోచించియున్నట్టయితే, ''వారు మొదట యూదులుగా మారితే'' అని కట్టుదిట్టం చేశావాడేమో. [41]రక్షణ ''మొదట యూదునికి, గ్రీకు దేశస్థునికికూడా'' (రోమా. 1:16). 13:45-46; రోమా. 2:9-10 అనే వాటినిగూడా చూడు. [42]ఇది ఇశ్రాయేలీయుల విషయంలో మాత్రమే కాదు. ఈ పత్రిక ఏయే దేశాలకు పోతుందో ఆయా దేశాలన్నిటిలోను - సత్యమే. [43]3:12లో పేతురు ప్రసంగించినట్టు చెప్పబడినా, 4:2లో మాత్రం - ''వారు ప్రజలకు బోధించుచు'' అని వ్రాయబడింది.